క్లుప్తంగా

నేడు బస్ షెల్టర్ ప్రారంభం


బస్‌షెల్టర్

వెదురుకుప్పం: మండలంలోని ఆక్లమడుగు గ్రామంలో నూతనంగా నిర్మించిన బస్‌షెల్టర్‌ను గురువారం సాయంత్రం ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కామసాని పద్మనాభరెడ్డి బుధవారం తెలిపారు. తన కుమారుడు కామసాని దినేష్ రెడ్డి జ్ఞాపకార్థం తల్లిదండ్రులు భారతి, పద్మనాభరెడ్డి సొంత నిధులు వెచ్చించి స్థానిక ప్రజల సౌకర్యార్థం బస్ షెల్టర్ నిర్మాణాన్ని చేపట్టారు. గురువారం పెద్దఎత్తున ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మహిళలకు చీరలు, యువతకు టీషర్టుల పంపిణీతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు.

నేటి నుంచి భారతం ప్రారంభం


ద్రౌపదీదేవి ఆలయం

పుత్తూరు రూరల్: శ్రీద్రౌపదీ సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నుంచి మహాభారత హరికథా గానం ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బీఎస్‌మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతికి చెందిన భాగవతారిణి ఎస్.సుమతి హరికథా గానం చేస్తారని తెలిపారు. ఈనెల 28వ తేదీ వరకు ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు.

ఒక నామినేషన్ దాఖలు

పుత్తూరు రూరల్: మండల పరిధిలోని వేపగుంట గ్రామ పంచాయతీ 3వ వార్డు మెంబర్ ఎన్నికకు బుధవారం ఏ.ఉష అనే మహిళ నుంచి ఒక నామినేషన్ దాఖలైనట్లు ఎలక్షన్ ఆఫీసర్ ఎం.మలర్‌విలి తెలిపారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ పరమేశ్వరమంగళం గ్రామ పంచాయతీ 4వ వార్డుకు నామినేషన్లు దాఖలు కాలేదని స్పష్టం చేశారు. మండలంలో జరుగుతున్న రెండు వార్డు సభ్యుల ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణకు ఈనెల 10వ తేదీ ఆఖరు గడువు. 11వ తేదీ నామినేషన్ల స్క్రూటినీ, 12న తిరస్కరించబడిన నామినేషన్లపై అప్పీల్, 13న అప్పీళ్ల డిస్పోజల్, 14న విత్‌డ్రా చేసుకున్న అభ్యర్థుల ప్రకటన, 19వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, 2 గంటలకు కౌంటింగ్ ప్రారంభించి పూర్తయిన వెంటనే ఫలితాల ప్రకటన ఉంటుందని వెల్లడించారు.

ప్రైవేటు పాఠశాలల వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీచేస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు

నగరి: ప్రైవేటు పాఠశాలలు వినియోగించే వాహనాలను బుధవారం చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్‌వీ మధుసూదన్ రావు తనిఖీచేశారు. వాహనాలన్నింటినీ కేవీకే మైదానానికి రప్పించిన ఆయన తన సిబ్బంది, పోలీసుల సాయంతో ప్రతి వాహనాన్ని నడిపి వాటి కండిషన్ తెలుసుకున్నారు. చిన్న లోపాలున్న వాటిని సరిచేసుకోవాలని యజమానులకు సూచించారు. స్కూల్ వాహనాలు ఎలా వినియోగించాలి, వాటికి ఎలాంటి అర్హత ఉన్న డ్రైవర్లను తీసుకోవాలో తెలియజేశారు. అప్పుడప్పుడూ వాహనాలు తనిఖీలో భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ ఉంటామని కండిషన్‌లో లోపాలుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలో అసిస్టెంట్ ఎంవీఐలు శివకుమార్, ప్రసాద్‌వర్మ, పోలీసులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

నింద్ర: ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించి రైతులు అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం సూచించారు. బుధవారం మండలంలోని అరూరు వ్యవసాయ పొలాల్లో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ రైతులు వరి సాగులో వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు అనుసరించాలని కోరారు. వరిలో సస్యరక్షణ పాటించడం వల్ల మంచి దిగుబడి పొందవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

లంపీ చర్మ వ్యాధి సోకకుండా టీకాలు


లంపీ టీకాలను వేస్తున్న పశువైద్య సిబ్బంది

శ్రీరంగరాజపురం: లంపీ చర్మవ్యాధి టీకా ప్రతి ఆవుకు కచ్చితంగా అందించాలని మండల పశువైద్యాధికారి శ్రీవిద్య అన్నారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పాడిరైతులు తప్పనిసరిగా ఆవులకు లంపీ వ్యాధి రాకుండా ముందుగానే టీకాలు వేయించాలని సచివాలయ పశువైద్య సిబ్బందికి సూచించారు. ఇది అంటువ్యాధి అని, ఒక పశువు నుంచి ఇంకో పశువుకు త్వరగా వ్యాపిస్తుందన్నారు. ప్రతిఒక్కరూ గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వేణుగోపాలపురంలో ఆవులకు లంపీ టీకాలు వేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ రఘునాథరెడ్డి, పశుసంవర్ధక శాఖ సహాయకులు హరి, సాయి, పవన్, దుర్గ, ప్రసాద్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నులి మేస్తున్నాయ్!

- పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతిస్తున్న నులిపురుగులు
- ఆల్బెండజోల్ మాత్రలతో పిల్లల్లో నులిపురుగుల నివారణ
- ఉచితంగా మాత్రలను పంపిణీ చేస్తున్న ప్రభుత్వం
- నేడు జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం



పాలసముద్రం : బాల్యంలో చిన్నారులను అనేక ఆరోగ్య సమస్యలు వెంటాడుతూ ఉంటాయి. తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలి. లేదంటే వారి ప్రాణాలకే ప్రమాదం వాటిల్లవచ్చు. ఆడుతూ పాడుతూ స్కూల్‌కు వెళ్లాల్సిన పిల్లలు కడుపునొప్పి అని చెబితే తక్షణమే వైద్యులను సంప్రదించాలి. చిన్నారుల జీవితాలను నులిపుగులు నులిమేస్తున్నాయి. ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. అయితే నులి పురుగులను ఒకే ఒక్క మాత్ర ఆల్బెండజోల్‌తో నివారించవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఆగస్టు 10వ తేదీన జాతీయ నులిపురుగు నివారణ కార్యక్రమం చేపట్టనుంది. ఇందులో భాగంగా ఆల్బెండజోల్ మాత్రలను చిన్నారులకు, విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోంది.

నులిపురుగులతో అనర్థాలు..

నులిపురుగులు చిన్నారుల్లో రక్తహీనతకు దారి తీస్తున్నాయి. శారీరక, మానసిక, ఎదుగుదలకు ఆటంకంగా మారతాయి. కడుపు నొప్పి, మంట, వికారం కలగజేస్తాయి. ఆహారం సహించదు. ఆకలి ఉండదు. పిల్లలు నీరసపడుతారు. వాంతులు, మలంతో రక్తం, అతిసారం ప్రబులుతాయి. ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లల్లో నులిపురుగుల సమస్య ఉంటుంది.

మాత్రలు ఎలా వేసుకోవాలంటే..!

ఏడాది నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు అల్బెండజోల్ సగం మాత్ర (200 మిల్లీగ్రాములు) నీళ్లలో కలిపి ఇవ్వాలి. 2 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు 400 మిల్లీ గ్రాముల మాత్రను మధ్యాహ్నం భోజనం తరువాత చప్పరించేలా చూడాలి. మాత్రను మింగకుండా పర్యవేక్షించాలి. పాఠశాలల్లో బోధనా సిబ్బంది, వైద్యసిబ్బంది పర్యవేక్షణలో మాత్రలు చప్పరించేలా చూడాలి.

నివారణకు ఏం చేయాలి..!

- పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి
- ఎప్పుడూ చేతిగోళ్లను కత్తిరించుకోవాలి. శుభ్రంగా ఉంచుకోవాలి. గోళ్లలో పేరుకున్న మట్టి ద్వారా నులిపురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి.
- కలుషిత నీరు తాగడం వల్ల, బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన వల్ల కూడా పురుగులు శరీరంలోకి వెళ్లే ప్రమాదం ఉంది.
- కాళ్లకు చెప్పులు లేదా బూట్లు ధరించాలి.
- భోజనం ముందు, తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి
- కూరగాయలను నీటితో శుభ్రంగా కడిగిన తరువాతే వినియోగించాలి.
- ఆహార పదార్థాలపై మూతలు తప్పకుండా మూయాలి.

మండలం	అంగన్‌వాడీల్లో పిల్లలు	ప్రభుత్వ పాఠశాలల్లో..
గంగాధరనెల్లూరు	2516	3582
శ్రీరంగరాపురం	2500	3800
వెదురుకుప్పం	2368	4235
కార్వేటినగరం	1900	3934
పెనుమూరు	2300	4150
పాలసముద్రం	382	2832

చిన్నారులకు తప్పకుండా ఇవ్వాలి..



"ఏడాది నుంచి 19 ఏళ్లలోపు ఉన్న పిల్లల్లో నులిపురుగుల సమస్య తప్పకుండా ఉంటుంది. అందువల్ల పిల్లలకు వారి తల్లిదండ్రులు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా ఇవ్వాలి. అప్పుడే పిల్లల కడుపులో నులిపుగురులు నశిస్తాయి. పిల్లల ఆరోగ్యం కూడా బాగుంటుంది. మానసిక ఎదుగుదలకు ఆటంకం ఉండదు.

– మోహన్‌కృష్ణ, వైద్యాధికారి

ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి



నేటి పిల్లలే రేపటి పౌరులు.. అందువల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే 2 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు బాధ్యతగా ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలి. అందులో 2–19 ఏళ్ల లోపు వారికి 400 మిల్లీగ్రాములు, రెండేళ్లలోపు చిన్నారులకు 200 మిల్లీగ్రాములు ఇవ్వాలి. అలాగే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

– రవిరాజు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి

దేశభక్తిని పెంపొందించుకోండి


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు రూరల్: స్వాతంత్ర సమరయోధులను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్ రెడ్డి సూచించారు. బుధవారం పుత్తూరు మండలం గోపాలకృష్ణాపురం గ్రామంలో నాభూమి–నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నిర్వహిస్తున్న "నాభూమి–నాదేశం" నేల తల్లికి నమస్కారం వీరులకు వందనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన సమర యోధులను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని కోరారు. ప్రతి పంచాయతీలో ఆజాది కా అమృత్ మహోత్సవ్ శిలాఫలకం ఏర్పాటు చేయాలన్నారు. అక్కడే పిడికిలి మట్టి లేదా మట్టి దీపంతో పంచ్ ప్రాణ్ ప్రతిష్ట చేసి ప్రతిజ్ఞ చేయాలన్నారు. 75 మొక్కలతో అమృత వాటికను ఏర్పాటు చేయడం ద్వారా సమర యోధులను, వారి కుటుంబాలను గౌరవించుకోవాలని చెప్పారు. ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఇందిర, ఎంపీపీ మునివేలు, గ్రామ సర్పంచ్ వేలాయుధం, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు


గర్భిణుకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం : మండల పరిధిలోని ప్రతి గర్భిణులు సకాలంలో వైద్య పరీక్షలు చేసుకుంటేనే మాతాశిశు మరణాలు జరగవని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు అన్నిరకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులకు హిమోగ్లోబిన్, బ్లడ్ షుగర్, బ్లడ్ గ్రూపింగ్, వీడీఆర్ఎల్, హెచ్ఐవీ, హెచ్‌బీఎస్ఏజీ తదితర పరీక్షలు చేశారు. డాక్టర్ వసంతి మాట్లాడుతూ గర్భిణులు ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉందన్నారు. అలాగే మజ్జిగ, పండ్లరసం నీరు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు నెలసరి వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. అనంతరం 53 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జ్ఞానశేఖర్ గర్భిణులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

హరోహర.. మార్మోగెరా..

- కావళ్లతో క్యూకట్టిన భక్తులు
- కిక్కిరిసిన సుబ్రమణ్యస్వామి ఆలయాలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రమణ్యస్వామి


చింతలపట్టెడలో కావళ్లతో ఊరేగింపు


శ్రీరంగరాజపురంలో..

నగరి : పట్టణంలో ఆడికృత్తిక వేడుకలు ఘనంగా జరిగాయి. హరోహర నామస్మరణలతో పట్టణం మార్మోగింది. సుబ్రమణ్య స్వామి ఆలయాలు బుధవారం భక్తులతో కిక్కిరిశాయి. బస్టాండు ప్రాంగణంలో పూజ సామగ్రి, పండ్లు, అరటిఆకులు, కావళ్ల విక్రయాలు భారీగా జరిగాయి. మున్సిపల్ పరిధిలోని ఏకాంబర కుప్పం సుబ్రమణ్యస్వామి ఆలయంలో భక్తులు కావళ్లతో క్యూకట్టారు. కొత్తపేట అగర వినాయక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామివారిని పట్టణ వీధుల్లో ఊరేగించారు. మున్సిపల్ పరిధిలోని గుడికండ్రిగ బోడిగుట్టపై ఉన్న సుబ్రమణ్యస్వామిని మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు కుమారస్వామి రెడ్డి దర్శించుకున్నారు. ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, నాయకులు కావళ్లను సమర్పించారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: కుమారగిరిపై వెలసిన వల్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామి వార్షిక ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం భక్తిశ్రద్ధలతో కావళ్లతో వచ్చిన భక్తులు చేసిన హరోహర నామస్మరణాలతో వీధులు హోరెత్తాయి. ముత్తమున స్వామిరెడ్డి, దేవారెడ్డి ఆధ్వర్యంలో 5వేల మందికి పైగా భక్తులకు అన్నదానం చేశారు. అదేవిధంగా మునిప్రసాద్ 30 వేల లడ్డూలను భక్తులకు వితరణ చేశారు. ఆలయ అధ్యక్షుడు కేశవరెడ్డి ఏర్పాట్లను అందించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఈఓ కృష్ణనాయక్ పలువురు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

గంగాధరనెల్లూరు: ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని ఎట్టేరికొండకు భక్తులు పోటెత్తారు. ఆడికృత్తిక సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి అధికసంఖ్యలో భక్తులు కావళ్లతో రావడంతో ఎట్టేరికొండ భక్తుల హరోహర నామస్మరణతో మార్మోగింది. జైన్ ఇరిగేషన్ సిస్టమ్ లిమిటెడ్ 100 గొల్లపల్లి, అదేవిధంగా చిత్తూరు పట్టణానికి చెందిన రామదాస్ కుటుంబ సభ్యులు భక్తులకు అన్న ప్రసాదాలను పంచిపెట్టారు. సుబ్రమణ్యస్వామి వారిని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానంద రెడ్డి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం : మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా ఆడికృతిక కావళ్లు బుధవారం ఎత్తారు. సాయంత్రం పంబవాయిద్యాలతో ప్రతి ఇంటి నుంచి కావళ్లు ఎత్తారు. అనంతరం తిరుత్తణి, ఎట్టేరి, కార్వేటినగరంలోని మురుగస్ ఆలయాలకు వెళ్లారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో బుధవారం వైభవంగా ఆడికత్తిక కావళ్లు ఎత్తారు. అమ్మవారికుప్పంలో వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయంలో కావళ్లు చెల్లించారు. కొందరు తిరుత్తణి ఆలయానికి వెళ్లారు.

నింద్రలో..

నింద్ర: ఆడికృత్తిక సందర్భంగా మండలం నుంచి పెద్దఎత్తున భక్తులు కావళ్లతో తిరుత్తణి సుబ్రమణ్య స్వామి ఆలయానికి వెళ్లారు.

వేల్ మురుగన్‌కు ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్ కండ్రిగ్ర గ్రామ సమీపంలోని అరుణగిరిపై ఉన్న శ్రీ వల్లీదేవసేన సమేత బాల సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు


వైద్యాధికారి దుర్గాదేవి

గంగాధరనెల్లూరు: ఆస్పత్రి ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వైద్యాధికారి డాక్టర్ దుర్గాదేవి హెచ్చరించారు. బుధవారం ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో రాత్రిపూట మందుబాబులు మద్యం సేవించి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అలాంటి వారిని గుర్తించి వారిపై ఫిర్యాదు చేసి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

మహనీయుల త్యాగాలు చిరస్మరణీయం


మాంబేడులో మొక్కలు నాటుతున్న జెడ్పీటీసీ సుకుమార్

వెదురుకుప్పం: మహనీయుల త్యాగాలు చిరస్మరణీయమని జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని మాంబేడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, వెదురుకుప్పం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణ ఎంపీడీఓ సుధాకరరావు, డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం త్యాగాలు చేసిన మహనీయులను స్మరించుకోవాలని చెప్పారు. వారి త్యాగఫలమే స్వాతంత్ర్య భారతదేశంగా అవతరించిందని తెలిపారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గృహనిర్మాణాలపై శ్రద్ధ పెట్టండి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ బాబు

పాలసముద్రం : మండల పరిధిలో జగనన్న లేఅవుట్‌లో నిర్మించుకుంటున్న గృహనిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనులు పూర్తి చేయాలని తహసీల్దార్ బాబు తెలిపారు. బధవారం తహసీల్దార్ కార్యాలయంలో హౌసింగ్ సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు ఆయన సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ బాబు మాట్లాడుతూ జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల మంజూరై ఇంకా పనులు ప్రారంభం చేయని లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చి ఇంటి పట్టాను రద్దు చేసి మరొకరికి అవకాశం ఇవ్వాలని తెలిపారు. ఎందుకంటే లేఅవుట్‌లో ఇళ్లు మంజూరు చేసి చాలారోజులు అయిపోయిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న గృహ నిర్మాణ త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. దీనికి ప్రజాప్రతినిధులు కూడా సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మదుబాబు, జెడ్పీటీసీ అన్నళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, హౌసింగ్ ఏఈ దాము, సూపర్‌వైజర్ బాబు పాల్గొన్నారు.

మాతృభూమి కోసం జీవిద్దాం


నా దేశం నా మట్టి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా, జేసీ శ్రీనివాసులు

- స్వాతంత్ర్య సమరయోధులకు అదే నిజమైన నివాళి
- 'నా దేశం–నా మట్టి' కార్యక్రమంలో మంత్రి ఆర్‌కే రోజా పిలుపు
- వీరులకు వందనం కార్యక్రమం కింద మాజీ సైనికుల కుటుంబసభ్యులకు ఘన సన్మానం

నగరి : స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ జీవితంలోని ప్రతిరోజు, ప్రతిక్షణం మాతృభూమి కోసం జీవించడమే వారికి మనం అర్పించే నిజమైన నివాళి అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. బుధవారం మండలంలోని బుగ్గ అగ్రహారం గ్రామంలో 'నా దేశం–నా మట్టి' నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' వేడుకలను శిలాఫలకాలు ఆవిష్కరించి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఈ దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడం కోసం ప్రాణత్యాగం చేసిన మహానుభావులు, స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకునేందుకు ఈ ఆజాదీ కా అమృత మహోత్సవ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. పిడికిలి మట్టితో గానీ, మట్టి దీపంతో గానీ పంచ్ ప్రాణ్ ప్రతిష్ఠ చేసి 75 చెట్లతో అమృత వాటికను సృష్టిస్తూ దేశం కోసం పోరాడే వీరులను, స్వాతంత్ర్య సమరయోధులను, వారి కుటుంబాలను గౌరవించుకుంటామని వివరించారు. దేశభక్తిని చాటే ఇలాంటి కార్యక్రమాల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. స్వచ్ఛమైన గాలి, నీరు, సారవంతమైన నేలను భావితరాలకు అందిద్దామని, పుడమి తల్లిని కాపాడుకుందామని అన్నారు. అందరికీ చేతిలో మట్టిని ఇచ్చి మన దేశం కోసం పోరాడిన వారి త్యాగాలను గౌరవిస్తానని, దేశ రక్షణ పురోగతికి మనల్ని మనం అంకితం చేసుకుందామని పంచ్ ప్రాణ్ ప్రతిజ్ఞ చేయడంతో పాటు అందరిచేత చేయించారు. సేకరించే మట్టిని ఢిల్లీలో జరిగే ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు ఉత్సవాల్లో చేరుస్తామన్నారు. మొక్కలు నాటి ప్రతి ప్రాంతంలో మొక్కలు నాటాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి. వీరులకు వందనం కార్యక్రమం కింద 1997లో ఉగ్రవాదుల దాడుల్లో వీరమరణం పొందిన నీలకంఠం సతీమణి నిర్మలను, 2003లో బాంబ్ బ్లాస్ట్‌లో కుడి కన్ను కోల్పోయిన మాజీ సైనికులు సుబ్రహ్మణ్యంను మంత్రి జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులుతో కలిసి సన్మానించారు. కార్యక్రమం ముగింపుగా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ గంగాభవానీ, టూరిజం ఈడి మల్లిరెడ్డి, నగరి ఆర్‌డీఓ సుజన, ఎన్ఆర్‌జీసీ ఏపీడీ శోభన్‌బాబు, మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ లీలామాధవి, హౌసింగ్ డీఈ శంకరప్ప, ఎంఈఓ శ్రీదేవి, సీడీపీఓ కృష్ణవేణి, ఎంపీపీ భార్గవి, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, వైస్ ఎంపీపీలు, మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

నగరి : డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, మినీ కార్యకర్త, సహాయకురాలి పోస్టులకు స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలో గుండ్రాజుకుప్పం దళితవాడ, కరకంతాపురం దళితవాడలోని అంగన్ వాడీ వర్కర్ పోస్టులకు, టీఆర్ కండ్రిగలోని హెల్పర్ పోస్టుకు, నింద్ర మండలంలోని ఎలకాటూరు హరిజనవాడలో అంగన్‌వాడీ వర్కర్, శ్రీరామి ఎస్టీ కాలనీలో మినీ అంగన్‌వాడీ వర్కర్, నింద్ర గ్రామంలో హెల్పర్, కార్వేటినగరం మండలం రౌతువాని గుంటలో మినీ అంగన్‌వాడీ వర్కర్, పాలసముద్రం మండలంలో ఈవీడీ పురం హెల్పర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 8 పోస్టులకు గాను 16 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీశిసు సంక్షేమ శాఖ అధికారి నాగశైలజ, జిల్లా టీకా అధికారి డాక్టర్ రవిరాజు. నింద్ర తహసీల్దార్ అమరేంద్రబాబు, వైద్యాధికారి రమేష్, జీడీనెల్లూరు, కార్వేటినగరం, నగరి సీడీపీవోలు వనితశ్రీ, ఎ.పద్మసునంది, కృష్ణవేణి హాజరయ్యారు.

ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం


వైద్య శిబిరంలో మాట్లాడుతున్న జ్యోతి

పుత్తూరు రూరల్: క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రత్యేకించి మహిళలు అవగాహన కలిగి ఉండాలని విశ్వ భారతి జ్ఞానజ్యోతి ట్రస్ట్ నిర్వాహకులు ఎస్.జ్యోతి కుమారస్వామిరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక 12వ వార్డు చిన్నబ్బనాయుడు కండ్రిగ గ్రామంలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో గర్భ సంచి, బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. అయితే తొలి దశలోనే గుర్తిస్తే క్యాన్సర్‌ను జయించవచ్చునన్నారు. వైద్య శిబిరం నిర్వహించడానికి సహకరించిన తిరుపతికి ఎస్‌వీఐ క్యాన్సర్ కేర్ సెంటర్ వైద్యుల బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామాల నుంచి వచ్చిన సుమారు 100 మంది మహిళలకు చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ మేనేజర్ పి.వి.హేమంత్ కుమార్, డాక్టర్ భార్గవ్, కోఆర్డినేటర్ వి.రెడ్డికుమారి, పి.శివ, చైతన్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్.చిరంజీవి, మాధవ, ఎస్.బాలాజీ, మునిరత్నం నాయుడు, వెంకట్రామయ్య, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా నా దేశం–నా మట్టి


పాలసముద్రం : నా దేశం–నామట్టి కార్యక్రమ ర్యాలీలో అధికారులు, ప్రజాప్రతినిధులు


పాలసముద్రం : శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


శ్రీరంగరాజపురంలో..


శ్రీరంగరాజపురం : శిలాఫలకాన్ని ప్రారంభించి ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

శ్రీరంగరాజపురం : నా మట్టి–నాదేశం కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మనిషి కూడా మాతృభూమి కోసం జీవించినప్పుడే స్వాతంత్ర్య సమరయోధులకు మనం అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. స్వేచ్ఛమైన గాలి, నీరు, సారవంతమైన నేల భావితరాలకు అందించడం కోసమే నా మట్టి–నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటి ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే స్వాతంత్ర్య సమరయోధులకు గుర్తుగా నాదేశం శిలాఫలకం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ సరిత, సర్పంచ్ ఉమామహేశ్వరి, అధికారుల, నాయకులు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో అమృత్ మహోత్సవంలో భాగంగా నా మట్టి– నాదేశం కార్యక్రమంలో భాగంగా మాతృభూమికి కృతజ్ఞతలు తెలిపేందుకు ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని జెడ్పీటీసీ సభ్యుడు అన్నళగన్, వైస్ ఎంపీపీలు శేఖర్ యాదవ్, పుష్ప తెలిపారు. బుధవారం ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్, వెంగళరాజుకుప్పం సర్పంచ్ లిల్లీ, ఆముదాల సర్పంచ్ అనురేఖ, బాలకృష్ణాపురం సర్పంచ్ శోభ సమక్షంలో నా భూమి–నాదేశం కార్యక్రమం జరిగింది. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.